# బద్నాం

తెలిదేవర భానుమూర్తి

## ఎన్నిక(ధ)లు

యాద్గిరి ఊరోడు.గాడు ఊల్లెనే సద్వుకుండు.గని గానికి పట్నంల కొల్వు దొర్కింది. కొల్వు దొర్కిన యాడాదికి గానికి పెండ్లయ్యింది. పెండ్లయిన రొండేండ్లకు గానికి ఒక పోరగాడు బుట్టిండు. పోరగాడు బుట్టిన మూడేండ్లకు గానికి ఒక బిడ్డ బుట్టింది. గిప్పుడు గాని పోర గానికి తొమ్మిదేండ్లు. పొల్లకు ఆరేండ్లు. పోరగాని పేరు సురేశ్. పొల్ల పేరు కావ్య. యాద్గిరి పిల్లలు పట్నంలనే బుట్టింన్రు. పట్నంలనే బెర్గింన్రు. గాల్లు ఎప్పటి సందో ఊరికి దీస్కబొమ్మని యాద్గిరిని ఒక్క తీర్గ అడ్గుతున్నరు.

ఎండ కాల మొచ్చింది.

"నాయినా! మా బడికి తాతీల్ ఇచ్చింన్రే" అని సురేశ్, యాద్గిరితోని అన్నడు.

"బడికి తాతీల్ ఇస్తె ఏందిరా?" అని యాద్గిరి అన్నడు.

"మా బడికి తాతీల్ ఇస్తె ఊరికి తోల్కపోతనని జెప్పినవు గదా" అని కావ్య అన్నది.

"పిల్లలు ఒక్క తీర్గ అడ్గుతుంటె సప్పుడు జెయ్యవేంది?" అని యాద్గిరి పెండ్లాం అన్నది.

"బడికి తాతీల్లు ఇచ్చింన్రు. గని నా ఆపీసుకు తాతీల్లు లెవ్వు గదా" అని యాద్గిరి అన్నడు.

"తాతీల్లు లేకుంటె తాతీల్ దీస్కోరాదు" అని గాయిన పెండ్లాం అన్నది.

"తీస్కుంట తియ్యి" అని యాద్గిరి అన్నడు.

గాయిన గట్ల అనంగనే -

"మా నాయిన మంచోడు" అన్కుంట యాద్గిరి పిల్లలు చెంగడ బింగడ ఎగిరింన్రు.

"ఆపీసుకు బోయి తాతీల్ దీస్కోని వొస్త. నేనొచ్చె తల్కె మీరందరు తయ్యారుగుండుంన్రి" అని యాద్గిరి అన్నడు.

యాద్గిరి ఆపీసుకు బోయి తాతీల్ దీస్కోని ఇంటికి వొచ్చిండు. అందరు గల్సి బస్‌డిపోకు బోయింన్రు. యాదిగిరి గుట్టకు బోయేటి బస్ల గూసున్నరు.కండక్టరు దగ్గరికి వొచ్చినంక-

"రాయిగిరికి రెండు ఫుల్. రెండు హాఫ్ టికిట్లు ఇయ్యింన్రి" అని యాద్గిరి అన్నడు.

బస్సు బోన్గిరి కాడ్కి రాంగనే యాద్గిరి పిల్లలు బస్సుల కెల్లి బోన్గిరి ఖిల్లను జూసింన్రు.

"నాయినా గా గుట్ట సూడే కూసున్న ఏన్గ తీర్గ ఉన్నది" అని అన్నరు.

"గుట్ట అంటె మస్తు రౌతులతోని ఉంటది. గని గీ గుట్ట ఒక్కటే నల్ల రౌతుతోని ఉన్నది" అని యాద్గిరి అన్నడు.

నాలుగ్గొట్టంగ రాయిగిరిల బస్సు ఆగింది. యాద్గిరి పెండ్లాం పిల్లల తోని బస్సు దిగిండు.రాయిగిరిల తొవ్వ పక్కపంటే సర్కార్ బడి ఉన్నది. గా బడి ఎన్క యాద్గిరి నాయిన ఇల్లు ఉన్నది. ఇంటి ముంగట అర్గులు గూడ ఉన్నయి. గా అర్గు మీద గూసోని యాద్గిరి నాయిన పోశయ్య సుట్ట దాగుతున్నడు. కొడుకు, కోడలు, మన్మడు, మన్మరాలును సూడంగనే గాయిన మొకం చమ్కాయించింది.

"నాయినా బాగున్నవా?" అని యాద్గిరి అడిగిండు.

"బాగున్నరా" అని పోశయ్య అన్నడు.

అందరు ఇంట్లకు బోయింన్రు. తానం జేసింన్రు. గింత దిన్నరు.తిన్నంక ఇంటి ముంగట ఉన్న యాపచెట్టు కింద మంచం ఏస్కోని పోశయ్య గూసున్నడు. గాయిన తాన్కి బోయి-

"తాతా! మా కొక కత జెప్పవా" అని యాద్గిరి పిల్లలు అడిగింన్రు.

"చెప్త.ఇనుంన్రి. ఒక ఊల్లె ఇస్తారి అనే టాయిన ఉన్నడు. గాయినకు మస్తు పొలాలున్నయి. పట్నంల రెండు కార్కానలున్నయి. నాలుగంన్రాల బంగ్లలు నాల్గున్నయి. గవ్విటి మీద గాయినకు మస్తు ఆమ్దాని వొచ్చేడ్ది. పని ఏం లేకుండె బట్కె గాయిన మారాజు లెక్క ఉండెటోడు. గాయినకు రాజకీయాల్ల దిగాలనిపిచ్చింది. ఒక రాజకీయ పార్టిల గాయిన షరీకయ్యిండు. ఎలచ్చన్లు రాంగనే గాయిన ఎమ్మెల్లె టికిట్ గురించి ఒక్క తీర్గ కోషిస్ జేసిండు. గాయినకు టికిట్ దొర్కింది. టికిట్ దొర్కక ముందే గాయిన ప్రచారం జేస్కున్నడు. ప్రచారం జేస్కుంట ఇల్లిల్లు దిరిగిండు. ఇల్లిల్లు దిరుక్కుంట రూపాలు బంచిండు. తాగుబోతులకు సార దాపిచ్చిండు. ఎలచ్చన్ల గెల్సిండు. ఎమ్మెల్లె అయ్యిండు. ఎమ్మెల్లె అయినంక గాయిన జెనంను యాదిమర్సిండు. ఒక్క పారి గూడ గాయిన జెనం తాన్కి బోలేదు. ఎవ్వలన్న పని మీద గాయిన తాన్కి వొస్తె గాల్ల తాన రూపాలు దీస్కోని పని జేసెటోడు. పనికి బువ్వ పద్కం కింద మంజూరయిన బియ్యం బస్తలను గాయిన అమ్ముకునేటోడు. ఏమన్న గుత్తపనులుంటె గాయిన బామ్మర్దికే ఇప్పిచ్చుకునెటోడు.

ఐదేండ్లు నిండినయి. ఇస్తారికి ఎమ్మెల్లె కుర్సి ఇడ్వ బుద్దిగాలేదు. ఇడ్వ బుద్ది గాకున్నా ఇడ్వక తప్పలేదు. మల్ల ఎలచ్చన్లు వొచ్చినయి. గీపారి గాయినకు ఎమ్మెల్లె టికిట్ రాదని అందరు అనుకున్నరు. గని గాయినకు ఎమ్మెల్లె టికిట్ వొచ్చింది.మల్ల గాయిన ఎలచ్చన్ల ప్రచారం జెయ్యబట్టిండు. గుడిసెలల్లకు బోబట్టిండు. కూలోల్లతోని గల్సి గట్క దాగ బట్టిండు. గాల్ల పోరగాల్ల ముక్కు సీమిడి దుడ్వబట్టిండు. చెట్టు కింద పండ బట్టిండు.గుడిసె హోటల్ల నాస్త జెయ్యబట్టిండు. గుడికి బోయి పూజలు జెయ్యబట్టిండు. మసీదుకు బోయి నమాజ్ సద్వ బట్టిండు. చర్చికి బోయి 'ఆదియూ అంతమూయూ ఏసునాథుడే' అని పాటలు పాడబట్టిండు. ఎవ్వలు కండ్ల బడ్డా గాల్ల మంచిచెడ్డలు అర్సుకోబట్టిండు. వైసోల్ల కద్పుల తల్కాయ బెట్టి మీ ఓట్లు నాకే ఎయ్యాలె అని అడ్గ బట్టిండు. నన్ను గెలిపిస్తె మీ ఊల్లె దవకాన బెట్టిపిస్త. బడి గట్టిస్త అని జెప్పబట్టిండు. ఎలచ్చన్లు అయినయి. ఇస్తారి మల్ల ఎమ్మెల్లె అయ్యిండు. గాయిన ఏం జెయ్యకున్నా మల్ల ఎమ్మెల్లె ఎట్ల అయ్యిండు" అని పోశయ్య అడిగిండు.

"గీ పారి గూడ గాయిన ఇల్లిల్లు దిరుక్కుంట రూపాలు బంచిపెట్టి ఉంటడు.తాగుబోతులకు సార దాపిచ్చి ఉంటడు" అని సురేశ్ అన్నడు.

"గీ పారి ఇస్తారి జెనం తాన్కి గాయిన చెంచగాల్లను బంపిచ్చిండు.గాల్లు ఆపోజిసనోల్ల జెండలు బట్కోని ఇల్లిల్లు దిరిగింన్రు. ఇల్లిల్లు దిరుక్కుంట రూపాలు బంచింన్రు. తాగుబోతులకు సార దాపిచ్చింన్రు. దాంతోని అపోజిసనోల్లు బద్నాం అయ్యింన్రు. గీపారి రూపాలు బంచినోల్లకు, సార దాపిచ్చినోల్లకు జెనం ఓట్లు ఎయ్యొద్దనుకునే బట్కె ఇస్తారి గెల్సిండు" అని పోశయ్య జెప్పిండు. •

